క్లుప్తంగా...

18న షబ్ ఏ ఖదర్ బహిరంగ సభ

నాంపల్లి: కుల్‌హింద్ రహ్మాతే ఆలమ్ సంస్థ ఆధ్వర్యంలో షబ్ ఏ ఖదర్ పేరిట బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హజ్రత్ ఖాజా సయ్యద్ అబుతురాబ్ షా ఖాద్రీ చిస్తీ బందేనవాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఏప్రిల్ 18న మంగళవారం పత్తర్‌ఘట్టీలోని కులీ కుతబ్‌షా స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పలువురు మత పెద్దలు, వక్తలు, ప్రముఖులు రాజకీయ నేతలు మహ్మద్ గౌస్ ఖాద్రీ, ఎం.ఏ.ముజీబ్, హఫీజ్ మహ్మద్ ముజఫర్ హుస్సేన్ ఖాన్ ఖాద్రీ, మౌలానా తహెసీన్ జిలానీ, మౌలానా హఫీజ్ అబ్దుల్లా ఖాన్ అజీమ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి పద్య నాటకోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

సుల్తాన్‌బజార్: పద్యనాటకోత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బొగ్గులకుంటలోని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో పద్య నాటకోత్సవాల పోస్టర్‌ను రమణాచారి, దేవాదాయశాఖ కమిషనర్ సునీల్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17, 18, 19 తేదీలలో రవీంద్రభారతి ప్రధాన వేదికపై గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ నిర్వహణలో పద్య నాటకోత్సవాలు జరుగనున్నాయని తెలిపారు. సత్యసాయి కళానికేతన్ వారిచే సత్య హరిశ్చంద్ర, శ్రీనాథుడు, యోగి వేమన్న వరుసగా మూడు రోజుల పాటు ప్రదర్శిస్తారని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీజీ నాగిరెడ్డి, కృష్ణమోహన్, అంకిరెడ్డి

అబిడ్స్: అగ్నిమాపక వారోత్సవాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫైర్ సర్వీసెస్ డీజీ.నాగిరెడ్డి, ఫైర్‌సేఫ్టీ ఇంటిగ్రేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు ఆర్.అంకిరెడ్డి ఈ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఫైర్‌సేఫ్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, విద్యాసంస్థల్లో, మాల్స్, సినిమా థియేటర్‌లు, వాణిజ్య సముదాయాల వద్ద అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఫైర్‌సేఫ్టీపై అందరికీ అవగాహన కలిగే విధంగా కృషి చేస్తామని వారు తెలిపారు.

బీజేపీకి ప్రజల ఆదరణ



నాయకులతో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో బీజేపీకి ప్రజల ఆదరణ మెండుగా ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలించే హక్కును కోల్పోయిందని, స్వయంగా రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులే అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయారన్నారు. మంత్రులను చూసి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి బంధువులు సైతం ప్రజాధనాన్ని లూటీ చేసుకుంటున్నారన్నారు. ప్రభు పూజారి, యాదగిరి ఉన్నారు.

అభినందనలు


అబిడ్స్: మినీయేచర్ గార్డెన్ (సూక్ష్మతోట)ను చూడముచ్చటగా రూపొందించిన 7వ తరగతి విద్యార్థిని వి.నూతన అనన్యను ప్రశంసించారు. శనివారం పబ్లిక్‌గార్డెన్‌లో ఆర్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్టికల్చర్ ఫెస్టివల్‌లో నూతన అనన్య మినీయేచర్ గార్డెన్‌ను అద్భుతంగా తయారు చేశారు. అందరినీ ఈ గార్డెన్ ఆకట్టుకోవడంతో అనన్యను రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు ప్రశంసించి అభినందించారు. అనన్య మాట్లాడుతూ.. తరచూ గార్డెనింగ్‌ను తయారీ చేయడంలో ఎంతో ఆనందంగా ఉందన్నారు.



దిల్‌దార్.. రాత్ బజార్

- కళకళలాడుతున్న రంజాన్ మార్కెట్లు
- ధర తక్కువ.. నాణ్యతలో రాజీ లేదు
- కుటుంబసభ్యులతో కలిసి రంజాన్ షాపింగ్
- విద్యుత్ కాంతుల్లో కొనసాగుతున్న రంజాన్ సందడి

రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. పాతబస్తీ పరిసరాలన్నీ రాత్రింబవళ్లు వ్యాపారాలతో కళకళలాడుతుంటాయి. కులమతాలకతీతంగా చార్మినార్, గుల్జార్‌హౌస్, మదీనా, షాలిబండ వివిధ ప్రాంతాల్లో కుటుంబ సమేతంగా షాపింగ్‌కు వస్తుంటారు. సాయంత్రం వచ్చి వేకువజాము వరకు చార్మినార్ ప్రాంతంలోనే గడుపుతారంటే అర్థమవుతోంది రంజాన్‌లో పాతబస్తీ ఎలా ఉంటుందో.



చార్మినార్: చార్మినార్–మక్కా మసీదు ప్రధాన రోడ్డులో కొనసాగుతున్న రంజాన్ మార్కెట్ జనం రద్దీతో కళకళలాడుతోంది. రంజాన్ మాసం సందర్భంగా ఫుట్‌పాత్ విక్రయాలు రోడ్డుపైకొచ్చాయి. వినియోగదారులతో దుకాణాలన్నీ బిజీగా మారాయి. పండగను పురస్కరించుకొని ముస్లింలు పండగ వస్తువులు ఖరీదు చేయడంలో నిమగ్నం కావడంతో పాతబస్తీ ముఖ్య వ్యాపార కేంద్రాలన్నీ సందడిగా కనిపిస్తున్నాయి. మహిళలు పండుగను పురస్కరించుకొని ముచ్చటగొలిపే రంగురంగుల గాజులను ఖరీదు చేస్తుండడంతో లాడ్‌బజార్ గాజుల దుకాణాలు మహిళల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ముస్లింలు రంజాన్ పండగకు ప్రత్యేకంగా గాజులను ఖరీదు చేసి ముచ్చటగా ధరిస్తారు. పాతబస్తీ ప్రజలే కాకుండా శివారు ప్రాంతాల జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి గాజులను ఖరీదు చేస్తున్నారు. లాడ్‌బజార్, ముర్గీచౌక్, గుల్జార్‌హౌజ్, శాలిబండ తదితర ప్రాంతాలలోని అత్తర్ దుకాణాలు ప్రజల రద్దీతో కిటకిటలాడుతున్నాయి.

కిటకిటలాడుతున్న దుస్తుల దుకాణాలు..

రంజాన్ పండగకు తప్పనిసరిగా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించడం ఆనవాయితీగా వస్తుండడంతో వాటిని ఖరీదు చేయడానికి అధిక సంఖ్యలో దుస్తుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. పటేల్ మార్కెట్, మదీనా, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టీ, రికాబ్‌గంజ్, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాలలోని వస్త్ర వ్యాపార కేంద్రాలు రద్దీగా మారాయి. ఖరీదు చేసిన నూతన వస్త్రాలను వెంటనే కుట్టించుకోవడానికి టైలర్ షాపులను కూడా ఆశ్రయించడంతో పాతబస్తీ టైలర్ షాపులకు కూడా గిరాకీ పెరిగింది.

కుటుంబ సభ్యులతో షాపింగ్ చేస్తూ..

ఉపవాస దీక్షలను విరమించిన అనంతరం కుటుంబసభ్యులతో కలిసి సరదాగా షాపింగ్ చేయడానికి చాలా కుటుంబాలు సుముఖత చూపిస్తున్నాయి. కళ్లు మిరమిట్లు గొలిపే రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ కబుర్లు చెప్పుకుంటూ సరదాగా రంజాన్ మార్కెట్లను సందర్శిస్తున్నారు. వివిధ రకాల గృహోపకర వస్తువులను చూస్తూ.. అవసరమైన చోట ఖరీదు చేస్తూ ముందుకు వెళుతున్నారు. ఇఫ్తార్ విందుల అనంతరం మహిళలు, పురుషులు, చిన్నారులు పండగ వస్తువులను ఖరీదు చేయడానికి వ్యాపార కేంద్రాలకు వస్తున్నారు.

కంటికి తేజస్సునిచ్చే సుర్మా..

చార్మినార్: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు 'సుర్మా' ను విరివిగా వినియోగిస్తున్నారు. ప్రతిరోజూ రెండు కళ్లకు ఈ సుర్మాను పెట్టుకుంటారు. ప్రవక్త మూసా అలైహి సలాం సుర్మాను వాడారు కాబట్టి ముస్లిం సోదరులు దీనిని సున్నత్‌గా భావించి రంజాన్ మాసంలో వాడుతున్నారు. అంతేకాక కంటికి తేజస్సుతో పాటు చలువదనాన్ని కూడా ఇస్తుంది.

- జీవిత కాలంలో కనీసం ఒక తులం సుర్మాను తప్పని సరిగా వాడాల్సి ఉంటుందని.. అందుకే రంజాన్ మాసంలో సుర్మా వినియోగం ఎక్కువగా ఉంటుందని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు.
- గల్ఫ్ దేశంలోని మరాఖిష్ ప్రాంతంలోని కోహితూర్ పర్వతం భస్మీపటలం కావడంతో అక్కడి భూమి నల్లగా మారిందని అక్కడికెళ్లిన ప్రవక్త మూసా అలైహి సలాం నల్లటి ఫౌడర్‌ను వేలితో తీసుకొని కళ్లకు పెట్టుకున్నారని చెబుతున్నారు. అప్పటి నుంచి మహ్మద్ ప్రవక్త వరకు ఈ సుర్మాను వాడారంటున్నారు.



కళ్లకు సుర్మా పెడుతున్న దృశ్యం

తొలగించిన 'గాంధీ' ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి



కోఠి డీఎంఈ వద్ద నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

సుల్తాన్‌బజార్: కోవిడ్ పేషంట్ కేర్ ప్రొవైడర్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బీఎస్పీ నగర అధ్యక్షుడు రుద్రవరం సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోఠిలోని డీఎంఈ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఎంఈ రమేష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022లో కరోనా కష్టకాలంలో గాంధీ ఆస్పత్రిలో కరోనా రోగులకు సేవలందించేందుకు ప్రభుత్వం 244 మంది సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతి ద్వారా నియమించుకుందన్నారు. వారితో మూడేళ్ల పాటు ఉద్యోగం చేయించుకుని మార్చి 31న ఉద్యోగాల నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డుపాలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణ, మహిళా సౌత్‌జోనల్ కన్వీనర్ శైలజ, జిల్లా ఇన్‌చార్జ్ నరేందర్, జనరల్ సెక్రటరీలు శ్రీనివాస్, నందకుమార్, మహ్మద్ ఎజాజ్, అవినాష్‌యాదవ్, రాజేందర్, రమేష్, పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు అభినందనలు



అనీల్‌కుమార్‌ను అభినందిస్తున్న బుంగ శివ కుమార్

చార్మినార్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బుంగ అనీల్‌కుమార్ దళిత రత్న అవార్డును అందుకున్న సందర్భంగా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివకుమార్ ఆయనను అభినందించారు. డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయనకు ఈ దళితరత్న అవార్డు లభించిందని బుంగ శివకుమార్ తెలిపారు.

సన్మానం



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ ప్రతినిధులు

జియాగూడ: లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో ఉచిత సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ చైర్మన్, డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కమల్ కిశోర్ అగర్వాల్ సేవలు ప్రశంసనీయమని హైదరాబాద్ రాయల్ అధ్యక్షుడు లయన్ వాయిల శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్‌లో లయన్ కమల్ కిశోర్ అగర్వాల్‌ను రాయల్ ప్రతినిధులు ఘనంగా సన్మానించి సత్కరించారు. లయన్ వాయిల శ్రీనివాసరావు, సెక్రటరీ లయన్ ఆకుల రవీందర్‌రావు మాట్లాడుతూ.. కమల్‌కిశోర్ అగర్వాల్, ఉచితంగా కంటి పరీక్షలు, నిరుపేదలకు వస్త్రదానం, అన్నదానం వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారన్నారు. లయన్ వనిత అగర్వాల్, సయిరామ్‌రాజు, గవర్నర్ రేసు మల్లారెడ్డి, వీడీజీ. లయన్ రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు ఉమాపేరి నోడర్, ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రావు, కార్యదర్శి రవీందర్‌రావు పాల్గొన్నారు.

డిగ్రీ పట్టాల ప్రదానం



డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుందర్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే తమ లక్ష్యమని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందర్‌రెడ్డి అన్నారు. శనివారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన పీజీడీఎం మొదటి బ్యాచ్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ, దేశాభివృద్ధిలో విద్యార్థుల ప్రాముఖ్యత అనే అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ డాక్టర్ వెంకట శివకుమార్, హెచ్‌ఓడీ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆచార్య పార్థసారథి

చార్మినార్: స్వతంత్ర భారతీశ పాలనా వ్యవస్థకు ప్రాణం పోసిన దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య పార్థసారథి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల పరిపాలన, రాజనీతి శాస్త్ర విభాగాల సంయుక్తాధ్వర్యంలో జరిగిన మహనీయుల జయంతి సభలో ఆచార్య పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్‌ల జీవితాల్లోని విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. బహుభాషల్లో పండితుడైన అంబేడ్కర్ అపారమైన తన మేధస్సుతో సమాజానికి ప్రామాణికమైన తాత్త్విక భూమికను అందించాడన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, డాక్టర్ శంకర్ కుమార్, డాక్టర్ యాదయ్య, డాక్టర్ రత్న ప్రభాకర్, డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌కుమార్‌కు సత్కారం

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మిత్రా క్లబ్ వ్యాయామశాల అసోసియేషన్ సభ్యుడు పసుపుల శైలేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో బాక్సింగ్ ఫెడరేషన్ ఇండియాలో తెలంగాణ నుంచి మొట్టమొదటిసారిగా రిఫ్రీగా ఎన్నికైన ఉదయ్‌కుమార్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జానకీరాం, సూరి, కృష్ణారావు, గౌరీశంకర్, రవి, బాలాజీ, మారుతిరావు, కల్యాణ రాముడు, దుర్గారాజ్, జమాల్‌పూర్ అశోక్, యాదయ్య, లక్ష్మణ్, సదానంద్, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఉదయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు శైలేందర్‌యాదవ్ తదితరులు

మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు



లయన్ రవిశంకర్ ఆధ్వర్యంలో..



ఇఫ్తార్ విందులో ఇన్‌స్పెక్టర్ శివకుమార్

అబిడ్స్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గౌలిగూడ చమాన్ వద్ద లయన్ ఇబ్రహీంపట్నం రవిశంకర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహదపడుతాయన్నారు. ప్రజల్లో ఐక్యత భావాలు, స్నేహ భావాలు పెంపొందించేందుకు ఈ ఇఫ్తార్ విందులు వేదికగా నిలుస్తాయన్నారు.

గౌలిపురా: రంజాన్ మాసం సందర్భంగా మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది, స్థానిక ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: తన ఎంపీ లాడ్ నిధులతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేశానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లోని కల్యాణ్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కేవలం కేంద్ర ప్రభుత్వం మీద ఆరోపణలు చేయడం తప్పా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై ఏ మాత్రం శ్రద్ధ కనబర్చడం లేదన్నారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల నిధులు అందుతున్నాయని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం వాటిని రాష్ట్ర నిధులంటూ గొప్పలు చెప్పుకుంటుందన్నారు. ప్రజల సొమ్మును ఇష్టారాజ్యంగా దోచుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని మరిచిందన్నారు. రాష్ట్ర ప్రజలు ఏ మాత్రం నిజంలేని ప్రకటనలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బదానం చేసే ప్రయత్నాలు చేస్తుందని ఆయన ఆరోపించారు. రైతులకు, పేద బడుగు వర్గాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని ఆయన అన్నారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ, నామా యాదగిరి తదితరులున్నారు.

తెలుగు భాష సుసంపన్నం కావాలి



ఆచార్య తంగెడ కిషన్‌రావుకు సూచనలు చేస్తున్న తెలుగు సంఘాల ఉమ్మడి ఐక్య వేదిక సభ్యులు

నాంపల్లి: తెలుగు భాష, సంస్కృతులకు పూర్వ వైభవం తీసుకురావడంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పెద్దన్న పాత్ర పోషించాలని తెలుగు సంఘాల ఉమ్మడి ఐక్య వేదిక పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావుకు సూచించారు. శనివారం తెలుగు సంఘాల ఉమ్మడి ఐక్య వేదిక కార్యదర్శి చంద్రప్రకాశ్‌రెడ్డి నేతృత్వంలో కోదండరామయ్య, డాక్టర్ సూర్యప్రకాష్‌రావు, కర్నాటి రఘురాం గౌడ్, డాక్టర్ కోదాటి అరుణ, మేఖా రవీంద్ర, దైవాదీనం, మనోహర్‌రెడ్డిలతో కూడిన ఒక ప్రతినిధి బృందం ఆచార్య తంగెడ కిషన్ రావును కలిశారు. తెలుగు భాషను సుసంపన్నం చేయడానికి వారు అవసరమైన పలు సూచనలు, సలహాలు చేశారు. సాంకేతిక వైద్య విద్యలను కూడా తెలుగు భాషలో బోధించాలని కేంద్రం ప్రయత్నిస్తుందని, దీని కోసం కావాల్సిన తెలుగు పదాలను తయారు చేస్తున్నారని, మామూలుగా జనం వాడే పదాలను అందులో ఉండేటట్లు చూడాలి. ఎవరికి అర్థం కాని పదాలను ఇతర భాషల నుంచి దిగుమతి చేసుకోకుండా చూడాలని కోరారు.

21న బాబూ జగ్జీవన్‌రామ్ సొసైటీ ఆధ్వర్యంలో సభ



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కొమ్ముల నరేందర్ తదితరులు

అబిడ్స్: ఈనెల 21న బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కేసీఆర్‌కు కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు కొమ్ముల నరేందర్ తెలిపారు. శనివారం మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఆయన ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ పేరును నామకరణం చేయడం రికార్డు అన్నారు. దేశవ్యాప్తంగా రికార్డు సాధించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు, అభినంద సభను రవీంద్ర భారతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శశికళ కృష్ణ

అబిడ్స్: ప్రజల అభివృద్ధి కేవలం బీజేపీ పార్టీతోనే సాధ్యమవుతుందని మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆర్కేపేట్‌లోని ముత్తబాడా వద్ద రూ.14 లక్షల విలువైన సీవరేజ్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజాసింగ్ అండదండలతో మంగళ్‌హాట్ డివిజన్ నలుమూలలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలు ఎలాంటి మస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, వివేక్, బంటి సంతోష్, రాకేష్ గౌడ్, సురేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నివారణపై అవగాహన



గోల్కొండ: టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే వరకు ఈ వ్యాధి లక్షణాలు తెలుసుకోలేమని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. శనివారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో యూ సెడ్ ఇండియా, కేహెచ్‌సిటీ సంయుక్త ఆధ్వర్యంలో దీనిపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ.. ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక టీబీ విభాగం ఉందని, అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి ఇంటి వద్దకే మందులు అందిస్తామన్నారు. యూసెడ్ ఇండియా డైరెక్టర్ అమ్రిత గోస్వామి, టీబీ అలెర్ట్ ఇండియా సీఈఓ వికాస్ పానిబట్ల, టీబీ అలెర్ట్ ఇండియా స్టేట్ కో ఆర్డినేటర్ రమేష్ దాసరి, టీబీ అలెర్ట్ ఇండియా కంట్రీ డైరెక్టర్ నటాషా భరోస్, గోల్కొండ ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ ఖాషా రవూఫ్ ఉద్దీన్ తదితరులున్నారు.

నేడు అంబేడ్కర్ విద్యావికాస్ మెరిట్ అవార్డుల ప్రదానం



మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

జియాగూడ: ఈనెల 16న ఉదయం 11గంటలకు జియాగూడలోని ఎస్.బి.ఎ గార్డెన్‌లో అంబేడ్కర్ విద్యా వికాస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విద్య, కళలు, క్రీడల్లో రాణిస్తున్న మెరిట్ విద్యార్థులు, క్రీడాకారులు, కళాకారులకే కాకుండా సామాజిక సేవలు అందిస్తున్న వివిధ సంఘాలు, కుల సంఘాలు, సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలు, ఉత్తమ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు, ఉత్తమ రాజకీయవేత్తలకు, ఉత్తమ సీనియర్ పాత్రికేయులకు, అన్నిరంగాల వారికి ఈ అవార్డులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కేటీఆర్‌తో పాటు మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

కష్టపడి పని చేసేవారికి మజ్లిస్ పార్టీలో గుర్తింపు



మజ్లిస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో మజ్లిస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం పార్టీ గుర్తు పెట్టుకుని పార్టీ కోసం పని చేయని వారికి పార్టీలో చోటులేదన్నారు. మజ్లిస్ క్రమశిక్షణకు గల పార్టీ అని అన్నారు. మజ్లిస్ కార్యకర్తలు పార్టీకి పట్టుగొమ్మలు లాంటివారని, వారి వల్లే పార్టీకి మనుగడ ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అహ్మద్‌బిన్ మోసిన్ బాకుల్కా, సయ్యద్ జబ్బార్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

రంజాన్ లోపు పనులు పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: రంజాన్ పండగ లోపు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని భవానీనగర్, నషేమాన్‌నగర్, చాచాగ్యారేజ్, తలాబ్‌కట్టా తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆమె నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. రానున్న రంజాన్‌కు స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందుగానే పనులు పూర్తి చేయాలని అధికారులకు చెప్పామన్నారు. ఇప్పటికే స్థానిక మసీదుల వద్ద సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమెతో పాటు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ జాఫర్, తదితరులు పాల్గొన్నారు.